రేపు ఉత్తర ద్వార దర్శనం

జగద్గిరిగుట్ట: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం వివిధ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ కమిటీలు బుధవారం తెలిపాయి. చింతల్‌, పద్మా నగర్‌ ఫేజ్‌1 లో శ్రీదేవి భూదేవి సహిత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జగద్గిరిగుట్టపై ఉన్న గోవిందరాజస్వామి ఆలయంలో, గుట్టపై ఉన్న శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో, గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వారా దర్శనం ఉంటుందన్నారు. 13వ తేదీన స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఉంటాయని తెలిపారు. జీడిమెట్ల డిపో సమీపంలోని నల్లగుట్ట నర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వార్షికోత్సవాల పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కొలన్‌ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్‌ : మార్చి 8వ తేదీన ట్రస్ట్‌ పదవ వార్షికోత్సవ సందర్భంగా మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వివిధ రంగాలకు చెందిన మహిళలకు ఉత్తమ మహిళా పురస్కారం అందిస్తున్నామని ట్రస్ట్‌ ఫౌండర్‌, చైర్‌పర్సన్‌ నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు కొలన్‌ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్‌ సభ్యులు జె.శ్రీదేవి, ఎం.పద్మ, మీరాభాయి, శశికళ, సరిత, విజయశ్రీ, అనిత, పుష్పవల్లి, దీప్తి, రాధిక, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో బస్సు డ్రైవింగ్‌ చేయాలి

జీడిమెట్ల: రెప్పపాటులో జరిగే రోడ్డు ప్రమాదాలను ఆపాలంటే డ్రైవర్లు క్రమశిక్షణతో బస్సులను నడపాలని జీడిమెట్ల ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ అన్నారు. బుధవారం జీడిమెట్ల డిపోలో నిర్వహించిన భద్రతా వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయి కుటుంబం రోడ్డున పడుతుందని, డ్రైవింగ్‌ చేసే క్రమంలో ట్రాఫిక్‌ రూల్స్‌ పాటించాలని డ్రైవర్లకు సూచించారు. డిపో మేనేజర్‌ ఆంజనేయులు, అసిస్టెంట్‌ మేనేజర్‌ నీలవేణి, ఎం.ఎఫ్‌. సందీప్‌, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రంగారెడ్డినగర్‌: దేశానికి ప్రపంచ వ్యాప్తంగా కీర్తి ప్రతిష్టతలు తెచ్చేందుకు మాజీ ప్రధాని, దివంగత అటల్‌ బిహారి వాజ్‌పేయి కృషి చేశారని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్‌ ఎస్‌. మల్లారెడ్డి అన్నారు. వాజ్‌పేయి శతజయంతోత్సవాల్లో భాగంగా బుధవారం రంగారెడ్డినగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన శిబిరంలో బీపీ, డయాబెటీస్‌, సాధారణ ఆరోగ్య సమస్యలపై మైహెల్త్‌ హాస్పిటల్‌ సిబ్బంది 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్‌, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ శ్రీనివాస్‌గౌడ్‌, జిల్లా కార్యదర్శి కేశవ్‌ యాదవ్‌, నాయకులు మణికంఠ, సంజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయం.. కేసు నమోదు

సుభాష్‌నగర్‌: ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా విక్రయాలపై సూరారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సీహెచ్‌ వెంకటేష్‌ ఆధ్వర్యంలో సూరారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో రెండు రోజులుగా పలుచోట్ల దాడులు జరిపారు. రాజీవ్‌ గృహకల్పలో ఎండీ నౌషద్‌ అనే వ్యక్తి చైనా మాంజా అమ్ముతున్నాడని తెలియడంతో మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. పెద్ద మొత్తంలో చైనా మాంజాను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేశారు. అదే విధంగా సూరారం విలేజ్‌ రోడ్డులో భవానీ స్టేషనరీలో చైనా మాంజాను విక్రయిస్తున్న ఈశ్వర్‌రావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త కొట్టాడని భార్య అదృశ్యం



ఎస్తేరమ్మ (ఫైల్‌)

దుండిగల్‌: మద్యం మత్తులో భర్త కొట్టడంతో భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన దుండిగల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్‌ గండిమైసమ్మకు చెందిన టీ స్టాల్‌ నిర్వాహకుడు ఎలమందయ్య, ఎస్తేరమ్మ(45) భార్యాభర్తలు. ఈ నెల 5న రాత్రి 9 గంటలకు మద్యం తాగి ఇంటికి వచ్చిన ఎలమందయ్య అన్నం విషయంలో భార్యపై చేయి చేసుకున్నాడు. అనంతరం కుటుంబ సభ్యులు నిద్రకు ఉపక్రమించగా.. రాత్రి 11 గంటల సమయంలో ఎస్తేరమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా నిజాంపేట్‌

గ్రేటర్‌ హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న నిజాంపేట్‌ కార్పొరేషన్‌ అన్ని రంగాల్లో దూసుకుపోతోంది. మూడు గ్రామాలు కలిసి కార్పొరేషన్‌గా ఏర్పడి కోట్ల రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులతో ఆదర్శంగా నిలిచింది. రెండు సార్లు స్వచ్ఛ సర్వేక్షణ్‌ అవార్డులను సైతం కేంద్ర ప్రభుత్వం నుంచి కైవసం చేసుకున్న ఘనత నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌కు దక్కింది. కార్పొరేషన్‌గా ఏర్పడి సుమారు రూ.329 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయి.

- రెండు సార్లు స్వచ్ఛ సర్వేక్షణ్‌ అవార్డు
- రూ. 329 కోట్లతో అభివృద్ధి పనులు
- ఐదేళ్లల్లో గ్రేటర్‌ స్థాయి అభివృద్ధి





స్వచ్ఛ సర్వేక్షణ్‌ అవార్డు అందుకుంటున్న మేయర్‌ కొలను నీలాగోపాల్‌రెడ్డి(ఫైల్‌)

నిజాంపేట్‌: గ్రామ పంచాయతీలుగా ఉన్న బాచుపల్లి, ప్రగతినగర్‌, నిజాంపేట్‌ గ్రామాలు కలిసి 2019 ఏప్రిల్‌ 21న నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌గా ఏర్పడింది. 2020 జనవరి 23న నిజాంపేట్‌ కార్పొరేషన్‌లోని 33 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లు జనవరి 27న ప్రమాణ స్వీకారం చేశారు. కొలను నీలా గోపాల్‌రెడ్డిని మేయర్‌గా, ధన్‌రాజ్‌ యాదవ్‌ను డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారు. 33 వార్డుల్లో బీఆర్‌ఎస్‌ 27 మంది కార్పొరేటర్లను కైవసం చేసుకుంది. ప్రగతినగర్‌లో దయాకర్‌రెడ్డి వర్గం స్వతంత్రంగా బరిలో నిలిచి ఆరుగురు విజయం సాధించారు.

పాలనపై పట్టు సాధించిన మేయర్‌

రాజకీయాలకు కొత్తగా పరిచయం అయిన నీలాగోపాల్‌రెడ్డి తన మామా కొలను రాఘవరెడ్డి, భర్త గోపాల్‌రెడ్డిల ద్వారా పునికి పుచ్చుకున్న రాజకీయ నేపథ్యంతో ఎలాంటి ఒడిదుడుగులు లేకుండా పాలనపై ప్రత్యేక ముద్ర వేసింది. కార్పొరేషన్‌ కార్యాలయంలో కమిషనర్‌తో పాలు అనేక విభాగాల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ అభివృద్ధి జరిగేలా తన వంతు కృషి చేసింది. కరోనా సమయంలో లాక్‌ డౌన్‌ సమయంలో సైతం ప్రజల మధ్య తిరుగుతూ ఆకలితో అలమటిస్తున్న వారికి అండగా నిలిచి శభాష్‌ అనిపించుకుంది. భారీ వర్షాలు, వరదల సమయంలో సైతం కాలనీల్లో ప్రజలకు అండగా నిలిచారు. తన ఐదేళ్ల పదవి కాలంలో ఎలాంటి వివాదాలు లేకుండా మొట్టమొదటి మేయర్‌గా తనదైన ముద్ర వేశారు.

అభివృద్ధిలో అగ్రగామిగా..

పెరుగుతున్న జనాభాతో పాటు ప్రజల మౌలిక అవసరాలు సైతం పెరిగాయి. ఇలాంటి సమస్యలను అన్నింటిని అధిగమించి అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఐదేళ్లుగా నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో మొత్తం 1755 పనులు మంజూరు కాగా.. అందులో 1381 అభివృద్ధి పనులు పూర్తి చేశారు. 53 పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఇంకా మరి కొన్ని పనులు ప్రారంభించాల్సి ఉంది. కొన్ని టెండర్‌ స్టేజీలో ఉన్నాయి. ఇలా ఇప్పటి వరకు కార్పొరేషన్‌లో మొత్తం సమారు రూ.329 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. వైకుంఠధామాలు, పార్కుల అభివృద్ధి, క్రీడా ప్రాంగణాలు, బస్తీ దవాఖానాలు, ఓపెన్‌ జిమ్స్‌, పబ్లిక్‌ టాయిలెట్స్‌, స్థలాల పరిరక్షణకు ఫెన్సింగ్‌, బీటీ, సీసీ రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, బతుకమ్మ ఘాట్స్‌, కమ్యూనిటీ హాల్స్‌, ఫుట్‌ పాత్‌ల నిర్మాణం, చెరువుల సుందరీకరణ తదితర పనులు జరిగాయి. అదేవిధంగా నిజాంపేట్‌లో సుమారు 7 కిలో మీటర్ల ఎస్‌ఎన్‌డీపీ పనులకు కార్పొరేషన్‌ సుమారు రూ.84 కోట్ల నిధులు మంజూరు చేసింది. (పనులు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించారు.)

రెండు సార్లు స్వచ్ఛ సర్వేక్షణ్‌ అవార్డు

కేంద్ర ప్రభుత్వం అందజేసే స్వచ్ఛ సర్వేక్షణ్‌ అవార్డును నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ రెండు సార్లు దక్కించుకుంది. 2021 సంవత్సరంలో ప్లాస్టిక్‌ వేస్ట్‌ నుంచి టైల్స్‌ తయారీకి, 2023లో కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య నిర్వహణలో పాటించాల్సిన పద్ధతులను పూర్తి స్థాయిలో అమలు చేసినందుకు అవార్డు వచ్చింది. ఈ అవార్డులతో నిజాంపేట్‌కు అదనపు నిధులు సైతం మంజూరయ్యాయి.

అందరి సహకారంతో అభివృద్ధి



నిజాంపేట్‌ కార్పొరేషన్‌ పాలక వర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేశాను. తొలి మేయర్‌గా బాధ్యతలు నిర్వహించడం సంతోషంగా ఉంది. నిధుల విషయంలో ఎక్కడా వెనుదిరిగి చూడకుండా అభివృద్ధి చేశాం. అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.

– కొలను నీలా గోపాల్‌రెడ్డి, మేయర్‌ నిజాంపేట్‌

ప్రణాళికలతో అభివృద్ధి



నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచింది. అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా కూడా రాజీ పడలేదు. పార్కులు, వైకుంఠధామాలు, రోడ్ల నిర్మాణం, వరద ముంపు సమస్యలను అధిగమించేందుకు ప్రణాళికలతో ముందుకెళ్లాం. రెండు సార్లు స్వచ్ఛ సర్వేక్షణ్‌ అవార్డు రావడం గర్వకారణం.

– సాబేర్‌ అలీ, కార్పొరేషన్‌ కమిషనర్‌

కళాశాలలో 'స్టే సేఫ్‌ స్టే స్ట్రాంగ్‌' వర్క్‌షాప్‌



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్య ప్రముఖులు

సుభాష్‌నగర్‌: ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ పిడియాట్రిక్స్‌ ఆధ్వర్యంలో సూరారంలోని మల్లారెడ్డి మహిళా మెడికల్‌ కళాశాలలో బుధవారం 'స్టే సేఫ్‌ స్టే స్ట్రాంగ్‌' వర్క్‌షాప్‌ నిర్వహించారు. మల్లారెడ్డి విశ్వవిద్యాలయ చాన్స్‌లర్‌ డాక్టర్‌ కేఎస్‌ సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 12వ తేదీ వరకు జరిగే 62వ ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ పిడియాట్రిక్స్‌ జాతీయ సదస్సులో భాగంగా నిర్వహించే ప్రీ కాన్ఫరెన్స్‌ వర్క్‌షాప్‌లలో ఇది ఒకటని తెలిపారు. మహిళలు స్వీయ రక్షణ పద్ధతులు, తమను తాము ఎలా సురక్షితంగా ఉంచుకోవాలన్న దానిపై అవగాహన కల్పిస్తామన్నారు. వర్క్‌షాప్‌లో 150 మంది వైద్య విద్యార్థినులు, నర్సులు, మహిళా డాక్టర్లు, వైద్య పట్టభద్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మెడికల్‌ కళాశాల డీన్‌ శ్రీలత, డాక్టర్లు అర్చన జోషి, జయశ్రీ దేశపాండే, బఖ్తియార్‌ చౌదరి, మమత రఘువీర్‌, ఎంఎస్‌జీ నాయర్‌, వెంకటాచలం, మెట్టు ప్రదీప్‌రెడ్డి, సుమప్రియ, మల్లా రెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అంజలి

నిజాంపేట్‌: మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా గంగుల అంజలి యాదవ్‌ను నియమించారు. దీంతో ఆమె బుధవారం కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డిని కలిశారు. అనంతరం హన్మంత్‌రెడ్డి ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు



భరత్‌కుమార్‌ సీఐ

సుభాష్‌నగర్‌: సంక్రాంతి నేపథ్యంలో గాలి పటాలు ఎగరవేసే క్రమంలో నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సూరారం సీఐ భరత్‌కుమార్‌ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పక్షులకు ప్రాణ సంకటంగా మారిన చైనా మాంజా వాడకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని, ఎవరైనా ఉపయోగించినా, విక్రయాలు చేపట్టినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. చైనా మాంజా విక్రయిస్తే 100కి డయల్‌ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

అబాకస్‌లో నేతాజీ విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికేట్‌ అందజేస్తున్న హైస్కూల్‌ కరస్పాండెంట్‌ మహేష్‌కుమార్‌

కుత్బుల్లాపూర్‌: హైదరాబాద్‌ జోనల్‌ లెవెల్‌ అబాకస్‌ వేదిక్‌ మ్యాథ్స్‌ పోటీలో నేతాజీ హైస్కూల్‌ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జీడిమెట్ల డివిజన్‌ ఇందిరమ్మ కాలనీలోని హైటెక్‌ మోడల్‌ స్కూల్‌లో విశ్వనాథ్‌ ఎడ్యూటెక్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు జంట నగరాలకు చెందిన 70 పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో నేతాజీ హైస్కూల్‌కు చెందిన రెండవ తరగతి విద్యార్థి సుమిత్‌ కుమార్‌ స్టార్‌ జూనియర్‌ లెవెల్‌ 3లో మొదటి స్థానం, 3వ తరగతి విద్యార్థి చార్విక్‌ 3వ స్థానం సాధించారు. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్‌ చింతల మహేష్‌కుమార్‌ ఆధ్వర్యంలో అభినందించారు. ఫిబ్రవరిలో జరిగే రాష్ట్ర స్థాయి పరీక్షకు అర్హత సాధించినట్లు తెలిపారు.

నాణ్యమైన వృత్తివిద్యా విధానం అవసరం

రిటైర్డ్‌ ఐఏఎస్‌ జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

సుభాష్‌నగర్‌: వృత్తి నైపుణ్యతను పెంపొందించే విధంగా నాణ్యమైన విద్యా విధానం కొనసాగాల్సిన అవసరం ఉందని రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి, తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ మాజీ చైర్మన్‌ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లిలో జరిగిన ట్రస్మా మొదటి కౌన్సిల్‌ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం(ట్రస్మా) అధ్యక్షుడు ఎస్‌.ఎన్‌.రెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్‌ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న 30 సంవత్సరాల్లో మన దేశాన్ని ప్రపంచ దేశాలలో మొదటి స్థానంలో నిలిపే విధంగా పాఠశాల స్థాయిలోనే బీజం పడాల్సిన అవసరం ఉందన్నారు. ఇంగ్లిష్‌ విద్య అవసరమేనని, మాతృ భాషను మాత్రం మర్చిపోవడం భావ్యం కాదన్నారు. లీడ్‌ ఇండియా– 2020 ఆచార్య ఎస్‌ బీ సుదర్శన్‌ మాట్లాడుతూ.. అబ్దుల్‌ కలాం కలలు కన్నట్టుగా ప్రతి విద్యార్థిని సైంటిస్ట్‌గా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనిల్‌ కుమార్‌, కోశాధికారి శ్రీకాంత్‌ రెడ్డి, అసోసియేషన్‌ ఫౌండర్‌ కందాల పాపిరెడ్డి, అధికార ప్రతినిధి లయన్‌ రామచందర్‌, మేడ్చల్‌ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌ రెడ్డి, మేడ్చల్‌ జిల్లా ట్రెజరర్‌ వేములకొండ సోమ శేఖర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తా




సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్‌ రషీదామహ్మద్‌ రఫీ

చింతల్‌: దశల వారీగా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్‌ రషీదామహ్మద్‌ రఫీ అన్నారు. బుధవారం చింతల్‌ డివిజన్‌లోని రోడా మేస్త్రీ నగర్‌ ఏ లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. రోడ్లు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచే దిశగా తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ శిరీష, ఏఈ నాగరాజు, వాటర్‌వర్క్స్‌ మేనేజర్‌ ర్యూసీ, ఎంటమాలజీ ఏఈ అరుణ్‌ కుమార్‌, ఈఎఫ్‌ఏలు అశోక్‌, సాయి, ఎస్‌ఎఫ్‌ఏలు గోపాల్‌, జీవన్‌, వాటర్‌వర్క్స్‌ లైన్‌మెన్‌ గంగాధర్‌ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఐఎంలో సమన్వయ్‌ వేడుకలు



విద్యార్థుల నృత్య ప్రదర్శన



కుత్బుల్లాపూర్‌: కొంపల్లిలోని శివ శివాని ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌లో రెండు రోజుల పాటు జరుగనున్న సమన్వయ్‌ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ జనరల్‌ మేనేజర్‌ అండ్‌ రీజనల్‌ హెడ్‌ శ్రీకాంత్‌ సూరంపూడి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన ఆలోచనలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. శివ శివాని విద్యా సంస్థల ప్రెసిడెంట్‌ ఆర్తి సంపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పేట్‌ బషీరాబాద్‌ సైబర్‌ క్రైమ్‌ సీఐ విజయ్‌, విద్యా సంస్థల వైస్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ శైలేష్‌ సంపతి, దీపికా సంపతి, డైరెక్టర్‌ ఎస్‌వీ రమణారావు, సమన్వయ్‌ కో ఆర్డినేటర్లు గ్రేస్‌ మణి, పుష్ప, సమర్పిత రాయ్‌, బిపుల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలతో నియోజకవర్గ అభివృద్ధి



కొలను హనుమంతరెడ్డి

కుత్బుల్లాపూర్‌ : దొరల గడీల పాలనకు కాంగ్రెస్‌తో విముక్తి లభించిందని, ప్రణాళికలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంతరెడ్డి అన్నారు. బుధవారం బాచుపల్లి పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌ సంవత్సర పాలనపై సాక్షితో మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ధరణి పేరుతో ప్రభుత్వ స్థలాలను కొల్లగొట్టి బడా బాబులకు కట్టబెట్టిందని ఆరోపించారు. కుత్బుల్లాపూర్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపడమే తమ లక్ష్యమన్నారు. వచ్చే గ్రేటర్‌, మున్సిపల్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌ బాబుతో చర్చిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని అనేక సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని ఆయన వివరించారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

మల్కాజిగిరి ఎంపీ , దిశ కమిటీ చైర్మన్‌ ఈటల రాజేందర్‌



ఎంపీ ఈటల రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ బలహీనవర్గాల ప్రజలకు చేయూతనందించడంతో పాటు జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించడమే కాకుండా సమస్యలపై చర్చించడానికి కాకుండా పరిష్కరించడానికి సమావేశాలు దోహదపడాలని మల్కాజిగిరి పార్లమెంట్‌ సభ్యులు, దిశ కమిటీ చైర్మన్‌ ఈటల రాజేందర్‌ అన్నారు. బుధవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రిరాజశేఖర్‌ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, అరికెపూడి గాంధీ, మెంబరు సెక్రటరీ జిల్లా కలెక్టరు గౌతమ్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్‌ ఈటల రాజేందర్‌ శాఖల వారీగా కేంద్ర, రాష్ట్ర పథకాల అమలును, పురోగతిపై సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అనే వ్యత్యాసం చూపకుండా ప్రజలకు సత్ఫలితాలు చేకూరేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రఘునాథ్‌స్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రశాంత్‌, పంచాయతీ రాజ్‌ ఈఈ వేణుగోపాల్‌, సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత తదితరులు పథకాల పురోగతిపై నివేదికలను ప్రవేశపెట్టారు.

డీఆర్‌సీ సమావేశాలు మళ్లీ నిర్వహించాలి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు కేటాయిస్తే, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. బుధవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌లో (దిశ) సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రైల్వేల అభివృద్ధికి కేటాయించిన నిధులు కంటే రెట్టింపులో ఈ పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకు సంబంధించి గతంలో రైల్వే పనులకు మాత్రమే కేంద్రం నిధులు విడుదలయ్యేవని, మోదీ ప్రభుత్వం హయాంలో 100 శాతం నిధులు అందజేస్తుందన్నారు. చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను కేంద్ర ప్రభుత్వం రూ.410 కోట్లతో అద్భుతంగా నిర్మించిందన్నారు. తెలంగాణలో 45 రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే రూ.2 వేల కోట్లతో సికింద్రాబాద్‌, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశ సంపద గణనీయంగా పెరిగిందన్నారు. రూ.4 లక్షల కోట్లతో యువతకు ఉపాధి కల్పన, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. దిశ సమావేశాలతో ప్రజా సమస్యలు చర్చకు రావటంతోపాటు పరిష్కారమవుతాయన్నారు.

వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్‌



కలెక్టర్‌ గౌతమ్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్‌

కుత్బుల్లాపూర్‌: శివారు ప్రాంతాల్లో వేగంగా జరుగుతున్న నగరీకరణ, పట్టణీకరణలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ అన్నారు. బుధవారం మేడ్చల్‌ జిల్లా కలెక్టరేట్‌ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల సమీక్షా సమావేశంలో భాగంగా నిర్వహించిన 'దిశ' కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై నియోజకవర్గ సమస్యలు, చేపట్టాల్సిన పనులపై మాట్లాడారు. డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇండ్ల సముదాయాల్లో 10 శాతం మూసీ బాధితులకు ప్రభుత్వం ఇస్తామని అంటున్నా, ఉండేందుకు వారు ముందుకు రావడం లేదన్నారు. కావున మిగిలి ఉన్న ప్లాట్‌లలో కనీసం 10 శాతం స్థానికంగా ఉన్నవారికి కేటాయింపులు చేపట్టాలన్నారు. కుత్బుల్లాపూర్‌లో వివిధ ప్రాంతాల్లో నిర్మించిన డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల సముదాయాల వద్ద లబ్ధిదారులకు ఇల్లు అప్పగించామని, కానీ వారికి మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించలేదన్నారు. అదేవిధంగా డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల సముదాయాల వద్ద అంగన్‌వాడీ సెంటర్‌, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రేషన్‌ షాపులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో (హిందూ, ముస్లిం, క్రిస్టియన్లతో పాటు ఇతరులకు) శ్మశాన వాటికలకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని సెంటర్లలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల కొరత తీవ్రంగా ఉందన్నారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి సరిపడా వంట సామగ్రిని అందజేయాలని కోరారు.

- నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 33 డివిజన్ల 33 స్వచ్ఛ ఆటోలలో 30 ఆటోలు మరమ్మతులకు నోచుకోవడంతో చెత్త తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. పారిశుద్ధ నిర్వహణలో స్వచ్ఛ అవార్డులను తీసుకున్న నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో నేడు ఇటువంటి పరిస్థితి రావడం బాధాకరమన్నారు.
- నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలకు మందులను రంగారెడ్డి జిల్లా నుంచి తీసుకురావాలంటే రవాణాలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. మేడ్చల్‌ జిల్లా నుంచి సరఫరా చేసినట్లైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, బస్తీ దవాఖానాలకు వేగంగా మందులను అందజేయవచ్చని వివరించారు.
- దుండిగల్‌ మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని మహేశ్వరం, బాచుపల్లి అంగన్‌వాడీ సెంటర్లకు ఎటువంటి ప్రహరీ లేదన్నారు. అదేవిధంగా టాయిలెట్లను కూడా నిర్మించకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పనులు చేపట్టాలన్నారు.